క్లుప్తంగా

మున్సిపల్ కౌన్సిలర్ కట్టా శ్రీరాములు మృతి


కట్టా శ్రీరాములు (ఫైల్)

రామచంద్రపురం: మున్సిపాలిటీలోని 27వ వార్డు కౌన్సిలర్, రిటైర్డు హాస్టల్ వార్డెన్ కట్టా శ్రీరాములు (76) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 27వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా ఆయన పార్టీకి సేవలందించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పలువురు కౌన్సిలర్లు శ్రీరాములు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కటుంబ సభ్యులను ఓదార్చారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తదితరులు శ్రీరాములు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక


కరాటే పోటీలకు ఎంపికైన మహేష్ కార్తిక్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రామచంద్రపురం రూరల్: రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ద్రాక్షారామ సూర్య హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి వాకాడ మహేష్ కార్తిక్ ఎంపికై నట్లు కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణ మంగళవారం తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి గోదావరి జిల్లా స్థాయి కరాటే పోటీలు అండర్–14 విభాగంలో మహేష్ కార్తిక్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు సోమేశ్వరం విద్యార్థి


మణికంఠ, వెంకటదుర్గాప్రసాద్, పీడీ జగదీశ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం దయామణి

రాయవరం: సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి యాళ్ల మణికంఠ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం రాయి దయామణి మంగళవారం తెలిపారు. కాకినాడ డీఎస్‌ఏ గ్రౌండ్స్‌లో జరిగిన పోటీల్లో మణికంఠ అత్యుత్తమ ఆటతీరును గుర్తించి అండర్–17 బాలుర కేటగిరీలో ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే అండర్–14 కబడ్డీ బాలుర పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జోడా వెంకటదుర్గాప్రసాద్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

జిల్లా హాకీ జట్టుకు వెంటూరు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని లక్ష్మీప్రసన్నతో హెచ్‌ఎం సత్తిరాజు, పీడీ రాఘవ

రాయవరం: మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడిశెట్టి లక్ష్మీప్రసన్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం డి.సత్తిరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన అండర్–14 బాలికల హాకీ విభాగంలో జిల్లా జట్టుకు లక్ష్మీప్రసన్న ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. 8వ తరగతి చదువుతున్న లక్ష్మీప్రసన్న హాకీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా జిల్లా సెలెక్టర్ల దృష్టిని ఆకట్టుకుందన్నారు.

మాంసం విక్రయదారులకు నోటీసులు జారీ చేయాలి

కాజులూరు: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మాంసం విక్రయాలను నిషేధిస్తూ దుకాణదారులకు నోటీసులు జారీ చేయాలని ఈఓపీఆర్డీ కొండలరావు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలపై నిషేధం ఉందన్నారు. సచివాలయ కార్యదర్శులు మాంసం విక్రయదారులకు నోటీసులు జారీచేసి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దసరా వస్తోందయ్యా..

- శరన్నవరాత్ర మహోత్సవాలకు ఊరూవాడా సిద్ధం
- రోజుకొక అలంకారంలో దర్శనం ఇవ్వనున్న జగన్మాత
- చలువపందిళ్లు వేస్తున్న ఉత్సవ కమిటీలు
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం


రాయవరంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ముస్తాబవుతున్న దుర్గాదేవి ఆలయం


వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

రాయవరం: గ్రామాల్లో దసరా ఉత్సవాల సందడి నెలకొంది. గురువారం నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చెడుపై మంచి విజయం సాధించినందుకు సూచికగా జరుపుకునే వేడుకలకు ఊరూ వాడా సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఉత్సవాలను ఇప్పుడు పల్లెల్లోనూ నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలోను ఉత్సవ కమిటీలు ఏర్పడి దుర్గాదేవికి శరన్నవరాత్ర ఉత్సవాలు చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో 120 గ్రామాలు ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే రాట ముహూర్తాలు చేశారు. మండపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, కాజులూరు, కుయ్యేరు, ద్వారపూడి, రాయవరం మండలాలతో పాటు వెదురుపాక విజయదుర్గా పీఠం, మాచవరం, రాయవరం, లొల్ల, పసలపూడి, కపిలేశ్వరపురం, అంగర, టేకి, వల్లూరు, కోరుమిల్లి, కేదారిలంక తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు

ఈ నెల మూడు నుంచి ప్రారంభమై ఈ నెల 13 వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన చలువపందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఒక్కోగ్రామంలో నాలుగు నుంచి ఐదు చోట్ల ఉత్సవ కమిటీలు అమ్మవారిని నిలుపుతున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై గ్రామాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దసమి ఉత్సవాలను వాడవాడలా ఉత్సాహంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఉత్సవ కమిటీలు చేపడుతున్నాయి.

శరన్నవరాత్రులు ఎందుకంటే?

ఏటా ఆశ్వయిజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకూ దేవీ నవరాత్రులు లేదా శరన్నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఆశ్వయిజ మాసం నుంచి వర్ష రుతువు వెళ్లి శరత్ రువుతు ప్రారంభమవుతుంది. కాబట్టి శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఈ రుతువులో వర్షాకాలం ముగిసి చలికాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణంలో కలిగే మార్పులు అనేక రోగాలకు కారణమవుతాయి. అందుకే ఆశ్వయిజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా పరిశుభ్రంగా ఉండి ప్రత్యేక పూజలు చేస్తారు. ఎటువంటి రోగాలు కూడా దరిచేరవన్నది నవరాత్ర వేడుకల సారాంశంగా పండితులు చెబుతారు.

ముస్తాబైన ప్రతిమలు

మంటపాల్లో కొలువుదీరేందుకు అమ్మవారి విగ్రహాలకు కళాకారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఇప్పటికే విగ్రహ నిర్మాణాలు పూర్తికాగా, వాటికి రంగులు, ఆభరణాలతో అలంకరిస్తున్నారు. దుర్గాదేవి ప్రతిమలతో పాటుగా పలువురు శారదాదేవి ప్రతిమలను కూడా కొలువుదీర్చి తొమ్మిది రోజుల పాటు పూజిస్తారు. శారదాదేవిలను మాత్రం నవరాత్రులు ముగిసిన అనంతరం నిమజ్జనం చేస్తారు.

పీఠంలో విజయదుర్గా అమ్మవారి అవతారాలు ఇలా

తేది	అవతారం
3	బాలాత్రిపురసుందరీదేవి
4	గాయత్రీదేవి
5	అన్నపూర్ణాదేవి
6	లలితా త్రిపుర సుందరీదేవి
7	రజత కవచ అలంకృత విజయదుర్గాదేవి
8	మహాలక్ష్మీదేవి
9	సరస్వతీదేవి(మూలా నక్షత్రం)
10	దుర్గాదేవి
11	మహిషాసురమర్దనీదేవి
12	రాజరాజేశ్వరీదేవి

పీఠంలో ఏర్పాట్లు పూర్తి

విజయదుర్గా పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారిని రోజుకొక రీతిలో అలంకరిస్తారు. భక్తులు స్వయంగా కలశాన్ని పీఠంలో ఏర్పాటు చేసుకుని నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీ. అమ్మవారికి ఎదురుగా పీఠంలో కలశాలను భక్తులు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీఠం భక్తజన కమిటీ తెలిపింది.

అమ్మ అనుగ్రహం కోసం..



అమ్మవారి కృపాకటాక్షాలు ఉంటే సకల శుభాలు కలుగుతాయి. నవరాత్రుల్లో అమ్మవారిని కొలవడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. పాడిపంటలు, పసుపు కుంకాలు, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండేందుకు అమ్మవారిని రోజుకొక రూపంలో కొలవడం భక్తుల విశ్వాసానికి ప్రతీక.
– విలపర్తి ఫణిధర్‌శర్మ, పురోహితుడు, రాయవరం

ఏర్పాట్లు పూర్తి చేశాం



పీఠంలో విజయదుర్గా అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశాం. తొమ్మిది రోజులు వివిధ సాహితీవేత్తలు పురాణ పఠనం చేస్తారు.
– వాడ్రేవు వేణుగోపాల్(బాబి), పీఆర్వో, విజయదుర్గా పీఠం, వెదురుపాక, రాయవరం మండలం

వృద్ధులకు దుస్తులు, రొట్టెల పంపిణీ


రోగులకు పండు, దుస్తులు పంపిణీ చేస్తున్న వీర్రాజుచౌదరి, సౌజన్య తదితరులు

కాజులూరు: వృద్ధుల పట్ల ప్రతిఒక్కరూ ఆదరాభిమానాలు కలిగి ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య కోరారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక నాయకుడు డాక్టర్ చుండ్రు వీర్రాజుచౌదరి పీహెచ్‌సీలోని 100 మంది వృద్ధులకు పండ్లు, రొట్టెలు, దుస్తులు పంపిణీ చేశారు. పలువురి వృద్ధ దంపతుల కాళ్లు కడిగి పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యం ఎవ్వరికీ భారం కాకూడదన్నారు. వృద్ధుల అనుభవాలను భావితరాలు ఆదర్శంగా తీసుకుంటూ వారికి చేదోడుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, కార్యదర్శి అంగర శ్రీను, ఆర్యావటం మాజీ సర్పంచ్ కోట తాతబ్బాయి, స్థానిక నాయకుడు పెంకే అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఉపాధి గ్రామ సభలు

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను గుర్తించేందుకు బుధవారం మండలంలోని 25 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ మోర్త ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఈ గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

మండపేట: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో భాగంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం పట్టణంలోని 13, 14 వార్డుల్లో పర్యటించి పలువురికి పింఛన్ సొమ్ము అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, టీడీపీ నాయకులు గీసాల సత్తిబాబు, చెలబోటి వీర్రాజు, సచివాలయ సిబ్బంది వున్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

మండపేట: స్వర్ణాంధ్ర– 2047లో భాగంగా మంగళవారం మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అనే అంశంపై పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు పి.వెంకన్న, డాక్టర్ ఎం. మధుకుమార్, ఎస్.రాజేష్ వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు రాంబాబు పాల్గొన్నారు.

డీఏ, ఐఆర్ ప్రకటించాలి

కె.గంగవరం: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ, ఐఆర్ ప్రకటించాలని పీఆర్‌టీయూ స్టేట్ నాయకుడు నరాల కృష్ణకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ కాల పరిమితి ముగిసి చాలా కాలమైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అలాగే ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరండ్ లీవ్, మెడికల్ రియింబర్స్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి ఇంటిగ్రేటెడ్ యాప్‌ను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి సేద్యానికి రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి


రైతులతో కలిసి పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్ తదితరులు

రాయవరం: పురుగుమందులు, రసాయన ఎరువుల అవశేషాలకు తావులేని ప్రకృతి సేద్యానికి రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ రైతులకు సూచించారు. రాయవరం, సోమేశ్వరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేద్యం చేయడం వలన ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి చేపట్టవచ్చునన్నారు. ప్రకృతి సేద్యం వైపు రైతులు అడుగులు వేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా శాస్త్ర, సాంకేతిక పద్ధతులను జోడించి, వ్యవసాయం చేయడాన్ని రైతులకు వివరించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై బరకాలు, స్ప్రేయర్లు అందేలా చూడాలని రైతు శాకా కోటేశ్వరరావు ఏవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, లొల్ల ఎంపీటీసీ వైట్ల సతీష్, స్థానిక నేతలు సుంకవిల్లి గంగరాజు, సోమేశ్వరం పంచాయతీ కార్యదర్శి పల్లేటి వెంకటరత్నం, వ్యవసాయ సహాయకులు తేజ, హరివబాబు, రైతులు పాల్గొన్నారు.

నేలటూరులో మాస శివరాత్రి పూజ

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో మంగళవారం 248వ మాస శివరాత్రి పూజ వైభవంగా నిర్వహించారు. స్థానిక బసవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. మండపేటకు చెందిన రిమ్మలపూడి అన్నపూర్ణ కుటుంబ సభ్యులైన రిమ్మలపూడి నారాయణరావు చౌదరి, శ్రీలక్ష్మి దంపతులు, సాయి అభినవ్, యరమాటి శ్రీనివాసు, అన్నపూర్ణ దంపతులు, ఉదయ్ కిరణ్‌మాళి ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల ఎనిమిది నెలలుగా గ్రామంలో మాస శివరాత్రి పూజలను చేస్తున్నామన్నారు.

ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం: రక్తదాన దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మోడరన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని మోడరన్ అధినేత డాక్టర్ జీవీ రావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు అకడమిక్ డైరెక్టర్ సాయిరాం చౌదరి అభినందించారు.

ద్రాక్షారామలో చెత్త సమస్యకు పరిష్కారం


ద్రాక్షారామలో వ్యర్థాల తొలగింపు పనులు

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో నెలకొన్న చెత్త సమస్యపై మంగళవారం 'ముక్కుపుటాలు అదిరేలా..' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీ, రెండు ట్రాక్టర్లు పెట్టి దుర్వాసన వెదజల్లుతున్న చెత్త తొలగింపు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా చెత్త తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం తెలిపారు.

జాతిపితకు కళాత్మక నివాళి


గాంధీ చిత్రాలతో విద్యార్థినులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులు జాతిపిత మహాత్మా గాంధీజీకి తమ నైపుణ్యంతో కళాత్మక నివాళి అర్పించారు. ప్రకృతిసిద్ధంగా లభించే రాగులతో తెల్లటి చార్టుపై గాంధీ ఆకారాన్ని తీర్చిదిద్దారు. పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు దాసరి వెంకటేష్ పర్యవేక్షణలో విద్యార్థులు ఎస్. ప్రవళికా జాహ్నవి, దేవి, జి.సాయిదుర్గ, ఎస్, ప్రియాంకలు రాగులు, ఇసుక, కాఫీ పొడర్, చోళ్లతో విడివిడిగా నాలుగు గాంధీజీ చిత్రాలను వేశారు. బోసినవ్వుల గాంధీ తాతకు సృజనాత్మకంగా నివాళి అర్పించిన విద్యార్థులను కళాశాల ప్రధానోపాధ్యాయుడు అంగర, రాజు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

బాలుడి వైద్యానికి టీచర్ల ఆర్థిక సాయం


బాలుడి తల్లికి సొమ్ము అందిస్తున్న ఉపాధ్యాయులు

మండపేట: బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న పట్టణానికి చెందిన నాలుగేళ్ల చార్విక్ తేజ వైద్యానికి స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం రూ.13 వేల సాయం అందించారు. ఈ బాలుడి వైద్యానికి రూ.30 లక్షలు ఖర్చవుతాయని డాక్టర్లు చెప్పారు. ఆ బాలుడి తల్లిదండ్రులు పేదవారు. ఈ విషయాలను స్థానిక బాలికల ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఎంవీ రాఘవ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది చూసిన తోటి ఉపాధ్యాయులు మానవత్వంతో స్పందించారు. మంగళవారం బాలుడి తల్లిని పాఠశాలకు పిలిచి తామంతా కలిసి సమకూర్చిన రూ.13 వేలను అందించారు. ప్రధానోపాధ్యాయుడు మందేశ్వరరావు, రామకృష్ణ, సుధారాణి, పాస్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండలస్థాయి చెకుముకి పోటీలు


ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో చెకుముకి పరీక్ష విజేతలతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు


రాయవరంలో విజేతలకు బహుమతులు అందజేసిన హెచ్‌ఎం సునీత తదితరులు

కపిలేశ్వరపురం: శ్రమతో రూపుదిద్దుకున్న సామాజిక సైన్స్ సామాన్యుల పరం కావాలని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంగరలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి సంబరాల్లో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అంగర రాజు సహకారంతో వేదిక అధ్యక్ష కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పెద్దింశెట్టి లెనిన్‌బాబు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. వేదిక గౌరవాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, యూటీఎఫ్ నాయకుడు డీవీ రాఘవులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ సైన్స్ సామాన్యులను దాటి పెట్టుబడిదారులు చేతుల్లో బందీగా మారిందన్నారు. దానివల్లనే సైన్స్ సాధించిన ప్రగతి మార్కెట్‌లో సరుకులుగా మారి సామాన్యుల ఆదాయాలను కొల్లగొడుతోందన్నారు. సైన్స్ సామాన్య ప్రజల చేతుల్లోకి తెచ్చే దిశగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. మండల స్థాయి చెకుముకి ప్రతిభా పోటీల్లో ప్రైవేటు విభాగం నుంచి అంగరలోని శ్రీరామకృష్ణ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కపిలేశ్వరపురం, అంగర, మాచర, నల్లూరు, కాలేరు, వల్లూరు, టేకి, వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో టేకి పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలోనూ, వాకతిప్ప బృందం ద్వితీయ, నల్లూరు విద్యార్థుల బృందం తృతీయ స్థానంలోనూ నిలిచారు. వారికి ప్రముఖుల చేతులు మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సంబరాలకు సహకరించిన ఆయా పాటశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు వేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీలు (సైన్స్ సంబరాలు) నిర్వహించారు. మండలంలోని 20 పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాసినట్లు చెకుముకి రూరల్ కన్వీనర్ రెడ్డి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల పరిశీలకుడు, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో సరికొత్త ఆలోచనలు ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తాయన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ద్రాక్షారామ సూర్య హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, గాయత్రి తిలక్ విద్యానికేతన్ విద్యార్థులు ద్వితీయ స్థానం, అన్నాయిపేటకు చెందిన సత్యం ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ ప్రథమ స్థానం, నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ ద్వితీయ స్థానం, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్ తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయని వివరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రత్నపద్మావతి, రూరల్ జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షురాలు పసుపులేటి మెహర్ సుజాత, కోశాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చెకుము పోటీలను మండల కన్వీనర్ ఎస్‌ఏ రహమాన్ పర్యవేక్షించారు. మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 15 టీమ్‌లు పోటీపడ్డాయి. ఈ టాలెంట్ పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలల నుంచి సాయితేజ విద్యానికేతన్, ప్రభుత్వ పాఠశాలల నుంచి జెడ్పీహెచ్ఎస్ సోమేశ్వరం ఎన్నికయ్యాయి. టాలెంట్ టెస్ట్ విజేతలకు హెచ్‌ఎం సునీత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాయితేజా పాఠశాల నుంచి ఒ.శ్రీదేవిసుమశ్రీ(10వ తరగతి), సీహెచ్.ఎస్.ఎస్.పార్వతిదీక్షిత(9వ తరగతి), ఏలేటి జోమ్(8వ తరగతి) ఎంపిక కాగా, జెడ్పీహెచ్ఎస్ సోమేశ్వరం నుంచి ఎస్.నాగరమ్య(10వ తరగతి), ఎస్‌వీఎస్ఎస్ సాయి(8వ తరగతి), ఆర్‌కేఆర్ఎస్‌డీవీవీ అర్జున్(9వ తరగతి) ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సాయన్న, గరగ సీతాదేవి, ఆర్ఎస్ఆర్ఎస్ సాయిబాబా, వి.బాలకృష్ణ, కుక్కల శ్రీనివాస్, బ్రహాజీ, కె.రామారెడ్డి, ఎస్‌బీబీ రామారావు, జి.వీరాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మండపేట: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చల్లా రవికుమార్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండపేట పట్టణ, మండల స్థాయిల్లో చెకుముకి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో పట్టణంలోని 13 పాఠశాలల విద్యార్థులు, రూరల్ నుంచి 11 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు భూషణం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి, ద్వారపూడి బాలమణికంఠ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచినట్టు జనవిజ్ఞాన వేదిక సభ్యుడు గండి స్వామిప్రసాద్ తెలిపారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వివిధ స్థానాల్లో విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక పట్టణ అధ్యక్షుడు పడాల రామచంద్రారెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించారు. అనంతరం వారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. గోపాలకృష్ణారెడ్డి, వేదిక పట్టణ కార్యదర్శి బొమ్మిడి రాజేంద్ర, జిల్లా యూత్ కన్వీనర్ ఉద్దండపు గుణ, కార్యవర్గ సభ్యులు నేతలు పాల్గొన్నారు.

కాజులూరు: విద్యార్థులు విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ ఎస్. డేవిడ్ సూచించారు. కాజులూరులో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాశారు. సీనియర్స్ విభాగంలో కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వాసిరెడ్డి రామలక్ష్మి, సాయివంశీ, లహరి పథమ స్థానం సాధించారు. కుయ్యేరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, అయితపూడి హైస్కూల్ విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో మంజేరు ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పథమ, తిప్పరాజుపాలెం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, అంద్రంగి ఎంపీపీ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ శీరం దుర్గాప్రసాద్, రాయుడు సుధీర్, ఇన్చార్జ్ హెచ్‌ఎం జె.శ్యామ్యుల్‌బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించినట్లు చెకుముకి మండల కన్వీనర్ బ్రహ్మానందం తెలిపారు. ఈ పరీక్షలో సత్యవాడ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, సుందరపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, కుందూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విజేతలకు ఎంఈఓలు ఎ.నాగరాజు, సీహెచ్ అంజనేయులు అభినందించారు.